సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్, మదీనాగూడ, చందానగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- ఇంద్రారెడ్డి ఆల్విన్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, సప్తగిరి కాలనీ, బీహెచ్‌ఈఎల్ హెచ్ఐజీ, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, మైత్రినగర్ ఫేజ్ 1,2,3, ప్రకాష్‌నగర్, వినాయక నగర్, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, సాయిరాం టవర్స్, వైశాలీ నగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- మదీనాగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు మదీనాగూడ విలేజ్, ప్రణామ్ హాస్పటల్ వెనకాల, మైత్రీనగర్, సితార హోటల్, మదీనాగూడ మెయిన్ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- చందానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ల్యాండ్ మార్కు రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసిరాం చాంబర్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.

తారానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

గచ్చిబౌలి: తారానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తారానగర్ ఇన్‌చార్జీ ఏఈ జి ఉమారాణి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నల్లగండ్ల విలేజ్, లక్ష్మీవిహార్, నల్లగండ్ల హుడాకాలనీ, ఎపిస్టిమో గ్లోబల్ ఏరియా, జవహర్‌నగర్, సాయిరామ్ కాలనీ, కంచ గచ్చిబౌలి, రామ్కీ గ్యాలక్సీ, అపర్ణా సరోవర్, అపర్ణా సైబర్‌లైఫ్, శ్రీకృష్ణ కాలనీ, లేక్‌వ్యూ రవిందర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్ ప్రాంతాలలో విద్యు ఉండదని వినియోగదారులు గమనించాలని కోరారు.

తబుస్సుమ్ హసన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూలో పరిశోధక విద్యార్థిని తబుస్సుమ్ హసన్‌కు గురువారం పీహెచ్‌డీ ప్రకటించారు. ఆమె ఉర్దూ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బిబిరజా పర్యవేక్షణలో '21వ శతాబ్దపు ఉర్దూ నవలల నేపథ్యం మరియు సాంకేతిక అధ్యయనం 2001–2018' అనే అంశంపై థీసిస్‌ను మర్పించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి పాపారాయుడు నగర్‌లోని శ్రీ సంజీవని ఆంజనేయస్వామి దివ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం యంత్రమూర్తి శిఖర ధ్వజస్తంభ జలాదివాసం, సాత్తుమొర, హారతి, మంత్రపుష్పం, విన్నపం, మంగళశాసనం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అదే విధంగా శనివారం 008 కలశాలతో సుదర్శన శతక హోమం, పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు, ఆదివారం సీతారామ చంద్రస్వామి కళ్యాణోత్సవం జరుగుతందని తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు అన్నదానం ఉంటుందని తెలిపారు.

'మనూ'లో ఒకరోజు సింపోజియం

రాయదుర్గం: మేధోపరమైన వైకల్యం ఉన్న పిల్లల పాఠ్యాంశాల అవసరాలపై గురువారం మనూలో సింపోజియం నిర్వహించింది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ నిధులలో 'అడాప్టివ్' అనే ప్రాజెక్టు కింద 'మేధోపరమైన వైకల్యం ఉన్న పిల్లల పాఠ్య ప్రణాళిక అవసరాలు' అనే అంశంపై ఒకరోజు సింపోజియంను నిర్వహించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్, ప్రాజెక్టు చీఫ్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ సింపోజియంకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎన్ఐఈపీఐడీ మాజీ హెచ్ఓడీ విఆర్ పిషీలాజా, ఐజీఎన్ఓయూ ప్రొఫెసర్ అమితవ్ మిశ్రా, ఎన్ఐఈపీఎండీ డాక్టర్ కామరాజ్, సహ పరిశోధకుడు ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని అలిమేలు మంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఆలయ చైర్మన్ ఊట్ల కృష్ణ, వైస్ చైర్మన్ గంగుల నర్సింహయాదవ్ , జనరల్ సెక్రటరీ ఊట్ల దశరథ్, లక్ష్మణ్, నిర్మల, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే ఆరికపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలో సుమారు రూ.8.95 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, పూజితగౌడ్‌లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కాలనీలు, బస్తీలలో వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. నాణ్యత ప్రమాణాలతో పనులను చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, గౌతమ్ గౌడ్, బ్రిక్ శ్రీను, సాంబశివరావు, సాంబయ్య, గుమ్మడి శ్రీనివాస్, అనిల్ కావూరి, రఘునాథ్, అన్వర్ షరీఫ్, లక్ష్మారెడ్డి, నరేందర్‌గౌడ్, సయ్యద్ సాదిక్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తదితరులు

వీధి వ్యాపారులకు న్యాయం చేయండి

కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి వినతి

గచ్చిబౌలి: పాతికేళ్లుగా గచ్చిబౌలి ప్రాంతంలో బతుకుతున్న చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని బీజేపీ నేత, జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం సైబరాబాద్ కమిషనరేట్‌లో ఆయనను కలిసి వీధి వ్యాపారుల సమస్యలను వివరించారు.



సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణ నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న భాస్కర్ రెడ్డి

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మహిళ సమాఖ్య రిసోర్స్ పర్సన్ (ఆర్‌పి)ల సమస్యలను పరిష్కరించాలని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్‌తో కలిసి వారు ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌పిలు మాట్లాడుతూ ప్రభుత్వపరమైన సర్వేలలో పనిచేస్తున్నామని, ముఖ్యంగా జీఓ నంబర్164ను తొలగించి ప్రభుత్వ పరంగా వేతనాలు చెల్లించాలని, వేతనాలు నెలకు 18 వేల వరకు పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ బీఆర్‌యస్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, తెలంగాణ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆర్‌పిల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమటం పద్మ, ఆర్‌పిలు స్వప్న, రూప, ప్రభావతి, పర్వీన్, లత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేసిన ఆర్‌పీలు

ప్రజలు ఓటుతో సమాధానం చెబుతారు

బీజేపీ నాయకుడు గజ్జెల యోగానంద్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఆల్విన్‌కాలనీ డివిజన్ తులసినగర్, భూదేవి హిల్స్‌లో బీజేపీ నాయకుడు గజ్జెల యోగానంద్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ చేస్తున్న భూకబ్జాలు, ఆగడాలకు ప్రజలు మండిపోతున్నారన్నారు. ప్రజలు త్వరలో వారికి ఓటుతో సమాధానం చెబుతారని పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వర్షాకాలం వర్షపు నీరు మురుగునీటితో కలిసి ఇళ్లలోకి వస్తున్నాయని, దోమలు పెరిగి చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లకు పలుమార్లు తెలియజేసినా స్పందించకపోవడంతో స్వంత ఖర్చులతో స్థానికులు బాగు చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో విజిత్‌వర్మ, సురభి రవీందర్, ప్రవంతి, రామరాజు, రఘు, రామకృష్ణ, రత్నకుమార్, లడ్డూ, సిద్దూ, ఈశ్వర్, నర్సింహారెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న యోగానంద్, నాయకులు

ఎస్టీయూ కేలండర్ ఆవిష్కరణ

పటాన్‌చెరు టౌన్: ఎస్టీయూ నూతన కేలండర్‌ను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి గురువారం క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్, రామచంద్రాపురం మండల అధ్యక్షుడు విజయ్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపరెడ్డి, రాజిరెడ్డి, ఈశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మీట్ మార్కెట్ అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మీట్ మార్కెట్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ తెలిపారు. గురువారం అధికారులతో కలిసి మీట్ మార్కెట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడల్ మీట్ మార్కెట్‌ను రెండంతస్తుల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

పేదలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పేదలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీకు చెందిన తులసి అనారోగ్యంతో బాధపడుతుండగా, మెరుగైన చికిత్స కోసం రూ.2 లక్షల 50వేలు ఎల్ఓసి పత్రాలను వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, పరమేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠకులకు మెరుగైన సౌకర్యాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గంలో గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. గురువారం రామచంద్రాపురంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ నరహరిరెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతి ఏటా ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్లు విడుదల అవుతున్నాయని, వాటికి అనుగుణంగా నిరుద్యోగుల కోసం పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. పట్టణంలో ఆధునిక నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కుమార్గౌడ్, నాయకులు బూరుగడ్డ నగేష్, ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తదితరులు

నూతన భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యే సహకారంతో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలో బండ్లగూడలోని శ్మశానవాటిక, ఆల్విన్‌కాలనీలో నూతనంగా నిర్మించబోయే జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ స్థలాన్ని, పటాన్‌చెరు పాత మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్‌ను తొలగించి దాని స్థానంలో మార్కెట్ షెడ్లను నిర్మించే ప్రక్రియలో భాగంగా జీహెచ్‌ఎంసీ ఏఈ శివకుమార్, ప్రైవేట్ కన్సల్టెంట్‌లతో పరిశీలించారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ మాట్లాడుతూ...డివిజన్‌లో చేపట్టే పనులకు నమూనా గీయించి, ఎమ్మెల్యేకు అందజేస్తానని తెలిపారు.



మహా జాగరణ ఆహ్వాన పత్రికను విడుదల చేసిన ఎమ్మెల్యే

మహాశివరాత్రి.. మహా జాగరణ

పటాన్‌చెరు: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలో మహా జాగరణ కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మహా జాగరణ ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహాశివరాత్రి రోజు రాత్రి 8:00 గంటల నుంచి అర్ధరాత్రి 12:30 గంటల వరకు వేద బ్రాహ్మణులచే అభిషేకం, శివపార్వతుల కల్యాణం, లింగోద్భవ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. తెల్లవారుజామున 5 గంటల వరకు ప్రముఖ గాయకులు ఎస్పీ చరణ్, వందేమాతరం శ్రీనివాస్, సునీత, ప్రముఖ యాంకర్ శ్రీముఖి, బిత్తిరి సత్తిలచే సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మెరాజ్ ఖాన్,కృష్ణ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుంకుమార్చన.. కల్యాణోత్సవం



రంగనాథస్వామికి గరుడవాహన సేవ



మహాలక్ష్మీ మాత

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని రంగనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చన, అభిషేకం ,బాలభోగం, బలిహరణ, ఆరాధన, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పల్లకిసేవను భక్తుల జయజయధ్వానాల మధ్య నిర్వహించారు. అనంతరం గరుడ వాహన సేవ నిర్వహించారు.

రంగనాథస్వామి కల్యాణం

రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి ప్రధాన ఘట్టంగా కల్యాణోత్సవాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా నిర్మించిన కళ్యాణ కట్టపై రంగనాధుడు, మహలక్ష్మీ కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉజ్జయిని మహంకాళి నగర్‌లో మంజీరా నీటి సమస్యను కాలనీవాసులు స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో ఆయన గురువారం ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో మంజీరా వాటర్ ప్రెషర్ సరిపోవడం లేదని, చంద్రమ్మ కాలనీ వరకు వచ్చిన మిషన్ భగీరథ పైపులైన్లను ఉజ్జయిని మహంకాళి నగర్ వరకు అనుసంధానం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అశోక్, పాండు, పోశెట్టి గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనుల పరిశీలన

మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని వేమనరెడ్డి కాలనీలో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. వేమనరెడ్డి కాలనీలో పార్క్‌ను అభివృద్ధి చేయాలని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే పార్క్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆమె వెంట డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, కాలనీ వాసులు ఉన్నారు.

కార్పొరేటర్ పర్యటన

మియాపూర్ : డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ గురువారం కాలనీవాసులతో కలిసి పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతి కాలనీ, బస్తీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్లు రఘు, నవీన్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మయూరినగర్ కాలనీలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

పెళ్లి పేరుతో కానిస్టేబుల్ మోసం

- షీటీమ్స్ ఫిర్యాదుతో వెలుగులోకి..

రాయదుర్గం: సీఏఆర్ (సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్) ప్రధాన కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గవ్వల హరిప్రసాద్ ఓ మ్యాట్రిమోనీ సైట్ ద్వారా పెళ్లి కోసం ఒకరికి అంగీకారం తెలిపాడు. ఆమెతో కలిసి ఓయో గదిలో గడిపారు. అనంతరం హరిప్రసాద్ పెళ్లికి నిరాకరించాడు. ప్రశ్నించగా ఆమె నంబరును బ్లాక్‌లిస్ట్‌లో ఉంచాడు. హరిప్రసాద్ మరో పెళ్లికి సిద్ధమైన విషయం ఆమెకు తెలిసి షీటీమ్స్‌కు ఫిర్యాదు చేసింది.ఫిర్యాదు ఆధారంగా మాదాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి జ్యూడీషియల్ కస్టడీకి పంపారు.

జనవరిలో షీటీమ్స్‌కు 104 ఫిర్యాదులు

గత జనవరి నెలలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో షీటీమ్స్ బృందాలకు పలు రకాల ఫిర్యాదులు అందాయి. వాట్సాప్ ద్వారా 92 ఫిర్యాదులు, నేరుగా నాలుగు, విమెన్ సేఫ్టీ వింగ్ ద్వారా ఆరు, క్యూఆర్ కోడ్ ద్వారా రెండు ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదుల్లో ఐదు ఎఫ్ఐఆర్‌లు, 31 పెట్టీకేసులు నమోదు చేశారు. సైబరాబాద్ పరిధిలో 790 డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించారు. ఇందులో 49 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. మొత్తం 282 అవగాహనా కార్యక్రమాలు నిర్వహించగా, 16,168 మంది పాల్గొన్నారు. నాలుగు కౌన్సిలింగ్ సెషన్స్‌ను నిర్వహించగా ఇందులో 266 మంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు రిమాండ్

మియాపూర్ : నిషేధిత గంజాయి క్రయవిక్రయాలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.. వారి వద్ద నుండి గంజాయిని కొనుగోలు చేస్తున్న మరో 5 మంది యువకులపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ యాదగిరిరావు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని గోకుల్ ప్లాట్స్‌లోని యాదవ్స్ నిలయంలో కొంత మంది వ్యక్తులు గంజాయి అమ్ముతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు మియాపూర్ పోలీసులు దాడి చేశారు. అక్కడ 8 మందిని అదుపులోకి తీసుకుని విచారించగా వైజాగ్‌కు చెందిన కట్టా వెంకటేశ్వర్‌రావు(33) వైజాగ్ నుండి గంజాయిని తీసుకువచ్చి కూకట్‌పల్లి కేపీహెచ్‌బి, వెంకటరమణ కాలనీకి చెందిన సలాడి శివ వెంకటేశ్వర్‌రావు(23), మరో వ్యక్తి కూకట్‌పల్లిలోని బాలాజీ నగర్‌కు చెందిన పోకూరి శివప్రసాద్(23) లకు గంజాయి అమ్ముతున్నాడు. శివ వెంకటేశ్వర్‌రావు, శివప్రసాద్‌లు స్థానికంగా యువకులకు అందజేస్తుండేవాడు. ఈ క్రమంలో వీరితో పాటు అక్కడ గంజాయిని తాగుతున్న పోతుల జయరామ కృష్ణ(21), కె. జగదీష్(22), కె. నిఖిల్(21), వై. నందకిషోర్‌రెడ్డి(24), పల్నాడి మధు(25)లను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 6.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కట్టా వెంకటేశ్వర్‌రావు, శివ వెంకటేశ్వర్‌రావు, శివప్రసాద్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా మిగతా ఐదుగురు యువకులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

పటాన్‌చెరు: మత్స్యకారుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ రాష్ట్రంలో నీలి విప్లవం సృష్టించారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని మత్స్యకార సహకార సంఘం ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో 38 మత్స్య సహకార సంఘాలు ఉండగా, 1752 మంది సభ్యత్వ నమోదు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మరో 4,529 మత్స్యకారులు సభ్యత్వాలు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం ఈనెల 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 18 ఏళ్ల నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు గల అభ్యర్థులు మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలకు హాజరై సభ్యత్వాన్ని పొందాలన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించడంతోపాటు, మత్స్య సంపదను పెంచేందుకు ప్రతి సంవత్సరం ఉచితంగా చేప పిల్లలను వదులుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో మత్స్యకార సొసైటీలకు శాశ్వత ప్రాతిపదికన పక్కా భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, మత్స్యశాఖ అధికారి సతీశ్, సహకార సంఘం ప్రతినిధులు, దశరథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462